# ఎత్తు- పై ఎత్తు



*పానేన భోజనేన చ తథా*
*గృహితోపి మండలో అసత్యా*
*జారం యధాభినందతి*
*బుక్కతి గృహ భర్తరి త్వయతి*

***భావం:*** అన్నమూ, నీళ్లూ ఇచ్చి ఆ జారస్త్రీ కుక్కను ఎంతగా వశపరచుకుందంటే ఆ కుక్క జారునికి ఎదురేగుతుంది. ఇంటి యజమానిని చూసి మొరుగుతుంది.

ప్రతి మగవాడిలోనూ బహు స్త్రీ వాంఛా, ప్రతి స్త్రీలోనూ బహుపురుష వాంఛా ఉంటాయని మానసిక శాస్త్రవేత్తలు చెప్తారు. పరిపరి

విధాల పోయే మనస్సుని ధర్మబద్ధమైన బుద్ధితో నియమించడం మానవుల కర్తవ్యం. మనస్సు ఏక వ్యక్తిపై లగ్నం కానప్పుడు మనకూ, పశువులకీ తేడా ఏముంది? అయితే సమాజంలో మగవాడి మనస్సులో ఎందరో స్త్రీలున్నా భార్యలు సహించాలన్నట్లుగా విలువలున్నాయి. ఆడది ఒకరికే అంకితం కాకపోతే కొంత విపరీత ధోరణి కిందే లెక్కకి వస్తుంది.

అటువంటి విపరీత ప్రవర్తన ఉన్న భార్య, పాపం, ఒక మగవాడికి దొరికింది. నీళ్లు తీసుకురావడానికి ఏటికి కుండ తీసుకుని వెడితే ఏటి ఒడ్డున ప్రియుడు ఆమెకై ఎదురుచూస్తూ ఉండేవాడు. అతనితో హాయిగా గడిపి వచ్చేది లేదా దుకాణానికి వెళ్ళి సరుకులు కొంటానని చెప్పి ఆనందంగా తిరిగి వచ్చేది. దేవాలయం, ఉద్యానవనం, రేగి డొంక ఆమె ప్రణయానికి అన్నీ అనుకూల స్థలాలే. భర్తకి ఆమె వ్యభిచారం సంగతి తెలిసింది.

ఇంటి పరువు నిలబడాలంటే ఇల్లాలిని కట్టడి చెయ్యాలనుకున్నాడు. ఇంటికి కావల్సినవన్నీ తనే తీసుకువస్తాననీ, ఆమె ఇల్లు కదలరాదనీ ఆజ్ఞాపించాడు. ఆమె భర్తతో ' ప్రాణనాథా, ఇంటి గడప దాటితే ఒట్టు' అంది. భర్త బయటకు వెళ్లగానే ప్రియుణ్ణి ఇంటికే రప్పించుకోసాగింది. కొన్నాళ్ళకి భర్తకి విషయం తెలిసింది. అతడొక పెద్ద కుక్కని కొని ఇంటికి కాపలా పెట్టాడు. ప్రియుడి రాకపోకలు అగిపోయాయి. భర్త హమ్మయ్య అనుకున్నాడు. కొన్నాళ్ళు అతనికి మనశ్శాంతి లభించింది.

ఆ నెరజాణ నెమ్మదిగా భర్తతో 'నాథా, వీధిలోకి వెళ్ళి అన్ని పనులూ మీరే చేస్తున్నారు. నాకు ఎక్కువగా పని లేదు. కుక్క సంరక్షణ చేస్తాను'. అంది. భర్త సరేనన్నాడు. ఆమె కుక్క బాధ్యత స్వీకరించింది. కుక్కకు మంచి ఆహారమిచ్చి, రోజూ శుభ్రం చేసి, బాగా ముద్దు చేసి దాన్ని మాలిమి చేసుకుంది. కుక్కకు ఆమెపై విశ్వాసం పెరిగింది.

కొన్నాళ్ళకు ఆమె ప్రియుణ్ణి రప్పించుకుంది. అతనితో స్నేహంగా ఉండడం చూసిన కుక్కకు యజమానురాలికి ప్రియుడే కావల్సిన వాడన్న

ఊహ కలిగింది. భర్తతో ఆమె ఎక్కువ చనువుగా లేకపోవడంవల్ల కుక్కకు కూడా భర్త ఇంటికీ, ఇంటి ఇల్లాలికీ పరాయి వాడన్న భావం ఏర్పడింది. దాంతో ప్రియుడు రాగానే కుక్క ఎదురు వెళ్ళేది. భర్తని చూడగానే మొరిగేది. కుక్క మొరుగుడు వినగానే ప్రియుడు ఇంటి వెనుక నున్న గోడ దూకి పారిపోయేవాడు. మదించిన ఏనుగునూ, కోరికతో మత్తెక్కిన ఆడదాన్నీ ఎవరూ కట్టెయ్యలేరేమో.

******